
ధాన్యానికి బోనస్ ఎలా ఇస్తారంటే...

బోనస్... బోనస్.. వరిరైతు నోట ఈ సారి ఇదే మాట..
సన్నాలకే వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నా, అవి ఏమిటనేది రైతుల్లో సందేహం ఉంది.
ఏ రకం ధాన్యానికి ఇస్తారు. ఎలాంటి నిబంధనలు ఉన్నాయో తెలుసుకుందాం.

న్యూస్‌టుడే, నారాయణపేట న్యూటౌన్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో వర్షాకాలం వరి ధాన్యం సేకరణకు పౌరసరఫరాల, సహకార, ఐకేపీ, మార్కెట్ కమిటీ అధికారులు సమాయాత్త మవుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సారి రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వింటాల్ ధాన్యానికి రూ. 5 వందలు బోనస్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టింది.

● ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ వర్షాకాలంలో వరి సాధారణ విస్తీర్ణానికి మించి సాగైంది. సాధారణ సాగు విస్తీర్ణం 6,35,144 ఎకరాలు కాగా ఈ సారి 7,64,914 ఎకరాల్లో సాగు చేశారు. అంటే 1,29,770 ఎకరాల్లో అదనంగా సాగు అయ్యింది. మొదట్లో వర్షాలు సరిగా పడకపోవడంతో విస్తీర్ణం తగ్గవచ్చని భావించారు. ముగింపులో మంచి వర్షాలు పడటంతో వ్యవసాయ బోర్ల రీఛార్జి కావడం, కుంటలు, చెరువులు నిండటంతో పుష్కలంగా సాగయ్యింది. బోనస్ వస్తుందనే నమ్మకంతో సాగు పెంచారని భావిస్తున్నారు.




రాంకిష్టాయపల్లి శివారులో సాగు చేసిన వరి

వీటికే ఇస్తారు

బోనస్ ఇవ్వడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. సన్నాల్లోని 33 రకాలకు వర్తింపజేశారు. ధాన్యం గింజ పొడువు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనేది తెలుసుకోవడానికి ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద ఈ సారి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీ మీటర్ల కంటే తక్కువ వెడల్పు రెండు మిల్లీమీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలి. ధాన్యం తేమ 17 శాతానికి మించనప్పుడు మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని నిర్దేశించారు.

వర్తించే రకాలు

సిద్ధి(డబ్ల్యుజీఎల్44)	జగిత్యాల్ మసూరి (జేజీఎల్11470)	రాజేంద్రనగర్ వరి - 4 (ఆర్ఎన్ఆర్ 21278)	సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)	పొలాస ప్రభ (జేజీఎల్ 384)	కూనరం వరి- 1 (కేఎన్ఎం 733)	శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
సాంబ మసూరి (బీపీటీ 5204)	కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)	జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)	సోమ్‌నాథ్ (డబ్ల్యుజీఎల్ 347)
జగిత్యాల్ వరి- 3(జేజీఎల్ 27356)	మానేరు సోనా (జేజీల్ 3828)	జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)	ఆన్ఆర్ఆర్ 31479(పీఆర్ఫ్)
జగిత్యాల్ వరి- 2(జేజీఎల్ 28545)	తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)	కరీంనగర్ సాంబ (.జేజీఎల్ 3855)	కేపీఎస్ 6251 (పీఆర్ఫ్)
వరంగల్ సాంబ(డబ్ల్యుజీఎల్ 14)	వరంగల్ వరి - 1119	అంజన (జేజీఎల్ 11118)	జేజీఎల్ 33124 (పీఆర్ఫ్)
వరంగల్ సన్నాలు (డబ్ల్యుజీఎల్32100)	కూనరం వరి- 2 (కేఎన్ఎం 1638	నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)	హెచ్ఎంటీ సోనా
	వరంగల్ వరి- 2 (డబ్ల్యుజీఎల్ 962)	ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)	మార్టేరు సాంబ (ఎంటీయూ 1224)
	ఎంటీయూ 1271		మార్టేరు మసూరి (ఎంటీయూ 1262)

ఆదర్శనీయుడు వాల్మీకి మహర్షి: కలెక్టరు



వాల్మీకి చిత్రపటానికి నివాళుల అర్పిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, తదితరులు

నారాయణపేట : వాల్మీకి మానవాళికి ఆదర్శనీయుడని కలెక్టరు సిక్తా పట్నాయక్ కొనియాడారు. వాల్మీకి జయంతిని గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. మహోన్నతమైన రామాయణ గ్రంథాన్ని అందించిన మహాకవిని స్మరించుకోవడం ఎంతో అవసరమని అన్నారు. రామాయణంలో ప్రతి ఘట్టం నైతిక, సామాజిక విలువలను ఉపదేశిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, శిక్షణ కలెక్టర్ గరిమా నరుల, బీసీ సంక్షేమాధికారి ఖలీల్, డీపీఆర్వో రషీద్, వసతి గృహ వార్డెన్లు, వాల్మీకి సంఘం నాయకులు బోయ లక్ష్మణ్, వెంకట్రాములు, కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుల వెన్నంటే ఉండాలి: బీకేఎస్


మార్కెట్ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న బీకేఎస్ నాయకులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : నారాయణపేట మార్కెట్ యార్డు అభివృద్ధికి కొత్త ఛైర్మన్ సదాశివారెడ్డి తన వంతుగా కృషి చేయాలని బీకేఎస్ ప్రాంతీయ ఉపాధ్యక్షుడు వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంత్‌రెడ్డి అన్నారు. గురువారం బీకేఎస్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్, డైరెక్టర్లను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులకు వెన్నంటే ఉండి, ఏ సమస్య తలెత్తినా పరిష్కారంలో ముందుండాలని కోరారు. వ్యక్తిగతంగా రైతులోకంపై ప్రేమతో సేవలు అందించాలని కోరారు. తమ సంఘం తరపున పూర్తి సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు బాలప్ప, రంగారెడ్డి, ప్రభుమిస్కిన్, విశ్వనాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బుగ్గప్ప, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భీతిగొల్పుతున్న తహసీల్దారు కార్యాలయం


కార్యాలయం ముందు భాగం

ఈ భవనం నిర్మించి పట్టుమని పదిహేనేళ్లు నిండలేదు. శిథిలమై ఘోరంగా తయారయ్యింది. ఇది ఊట్కూరు మండల ప్రజల పరిపాలన కేంద్రమైన తహసీల్దారు కార్యాలయం. రెండు నెలల క్రితం పని నిమిత్తం వచ్చిన ఇద్దరు వ్యక్తులపై పెచ్చులూడి పడటంతో తలకు గాయాలయ్యాయి. ఎప్పుడు ఏమవుతుందోనని ప్రజలు, ఉద్యోగులు భయపడుతున్నారు. పైకప్పు భాగంలో నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా నిర్మించటంతో గోడల్లోకి నీరు దిగి పగిలిపోతున్నాయి. రికార్డుల గది, ఉప తహసీల్దారు గది పైకప్పు ఊచలు తేలి పెచ్చులూడుతోంది. భవనం విషయాన్ని తహసీల్దారు చింత రవి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా మరమ్మతుల కోసం గతంలో ప్రతిపాదనలు పంపించామన్నారు. మరోసారి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి పనులు జరిగేలా చూస్తానన్నారు. – న్యూస్‌టుడే, ఊట్కూరు

ఆగని తవ్వకాలు

ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా క్వారీల్లో అక్రమాలు

ఈనాడు, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని మైనింగ్ అక్రమాలపై ఇటీవల వచ్చిన ఫిర్యాదులు, విచారణలు చర్చనీయాంశంగా మారాయి. గతంలో ఇక్కడ పని చేసిన ఆ శాఖ ఏడీ సస్పెన్షన్‌కు గురి కావడం, జడ్చర్ల సమీపంలోని శంకరాయపల్లిలో తవ్వకాలపై ఉన్నతాధికారుల విచారణతో మరోసారి గనుల అక్రమాలు తెరపైకి వచ్చాయి. గత కొన్నేళ్లుగా ఉమ్మడి జిల్లాలో మైనింగ్ వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. పట్టించుకొనే నాథుడే కరవయ్యాడు. అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వుతూ కొందరు నిర్వాహకులు రూ.కోట్లు దండుకుంటున్నారు. వీరికి కొందరు అధికారులు సహకరిస్తుండటంతో అక్రమాలకు అడ్డే లేకుండాపోతోంది.

ఉమ్మడి జిల్లాలో మొత్తం 285 క్వారీలకు అనుమతులిచ్చారు. వీటిలో క్వార్ట్జ్, ఫెల్స్‌ఫార్, స్టోన్ అండ్ మెటల్, కలర్ గ్రానైట్, బ్లాక్ గ్రానైట్, మొరం వంటి వాటికి మైనింగ్ శాఖ అనుమతులిచ్చింది. పలు క్వారీల్లో అనుమతులు తీసుకున్న దాని కంటే అధికంగా గుట్టలను తవ్వేస్తున్నారు. టన్ను రాయికి రూ.80, మొరం మట్టికి రూ.35 రాయల్టీ చెల్లించాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ సీఎం సొంత జిల్లాలోనే ఈ అక్రమాలు ఆగడం లేదు.


జడ్చర్లలోని శంకరాయపల్లి గుట్టలోని క్వారీ పరిస్థితి

సర్వే పేరుతో కాలయాపన..: పాలమూరులో ఎక్కడెక్కడ మైనింగ్ పేరుతో అక్రమంగా క్వారీలు తవ్వి అక్రమాలకు పాల్పడుతున్నారో ఆ శాఖకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. కొన్ని చోట్ల మైనింగ్ శాఖలో కొందరు అధికారులు, సిబ్బంది ఎక్కడ అక్రమాలు జరుగుతాయో అక్కడ వాలిపోతారన్న విమర్శలు ఉన్నాయి. అయినా అక్రమార్కులపై చర్యలు మాత్రం ఉండవు. ఎక్కడైనా ఆరోపణలొస్తే డీజీపీఎస్ సర్వే చేస్తున్నామని అక్రమాలు అందులో వెల్లడవుతాయని చెప్పి తప్పించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మైనింగ్ శాఖకు చెందిన పలువురు అధికారులు గత ఏడాదిగా డీజీపీఎస్ సర్వే పేరుతోనే పలు వత్తిళ్లతో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

మచ్చుకు కొన్ని

● మహబూబ్‌నగర్ జిల్లా శంకరాయపల్లిలో మూడు క్వారీలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. దేవరకద్ర నుంచి కోయిల్‌సాగర్ వెళ్లే దారిలోనూ ఓ గుట్టను క్వారీ అనుమతుల పేరుతో కొల్లగొట్టారు. మిడ్జిల్ మండలం లింబ్యాతండాల్లోనూ కొందరు వ్యక్తులు పోటీ పడి మైనింగ్ ద్వారా రూ.లక్షల్లో సంపాదించుకున్నట్లు ఆరోపణలున్నాయి. భూత్పూరు మండలంలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. బాలానగర్, మిడ్జిల్ మండలాల్లో పలు గుట్టలు మొరం పేరుతో యథేచ్ఛగా తవ్వకాలు సాగుతున్నాయి.

● జోగులాంబ గద్వాల జిల్లాలో ఇద్దరు ప్రధాన నేతలకు క్వారీలున్నాయి. ఇక్కడ నిబంధనల్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. రూ.కోట్లలో రాయల్టీని ఎగ్గొట్టినట్లున్నారని ప్రచారం జరుగుతోంది.

● వనపర్తి జిల్లా కొత్తకోట, పెద్దమందడి, గోపాల్‌పేట, రేవల్లి మండలాల్లో క్వారీల నుంచి ఇష్టారాజ్యంగా పేలుళ్లు చేసి అక్కడే క్రషర్ యంత్రాల ద్వారా కంకరగా మార్చి విక్రయిస్తున్నారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలంలోని పలుగురాళ్ల పేరుతో తీసుకున్న మైనింగ్ అనుమతులు స్థానికంగా వివాదాస్పదమయ్యాయి. దీనిపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. కొల్లాపూర్, అచ్చంపేట, ఉప్పునుంతల, తాడూరులోనూ గుట్టలను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి వ్యాపారం చేస్తున్నారు.

● నారాయణపేట జిల్లాలో రాయచూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ఆనుకొని పలు చోట్ల మైనింగ్ వ్యాపారం నడుస్తోంది. ఇక్కడ పూర్తిగా నిబంధనలను పక్కన పెట్టి వ్యాపారం చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

● పాలమూరులో ఏ పల్లెకు వెళ్లినా మొరం కోసం యథేచ్ఛగా తవ్విన మట్టి గుట్టలే కనిపిస్తాయి. ఎలాంటి పెట్టుబడి లేకుండా రూ.లక్షల్లో సంపాదన ఉండటంతో చాలామంది గ్రామాల్లో ఉన్న మట్టిగుట్టలను తవ్వి వ్యాపారం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో జాతీయ రహదారుల పేరుతో ఇష్టారాజ్యంగా మొరం మట్టి కోసం గుట్టలను మాయం చేస్తున్నారు.

ఎస్జీటీలను వదలకుంటే ఆందోళన : తపస్


డీఈవో అబ్దుల్ ఘనీకి వినతి పత్రం అందిస్తున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : జిల్లాలో బదిలీ అయిన ఎస్జీటీ ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్ కృష్ణా రెడ్డి, నరసింహ హెచ్చరించారు. ఈ మేరకు డీఈవో అబ్దుల్ ఘనీకి వినతి పత్రం అందించారు. జూలైలో బదిలీ అయితే ఇంతవరకు పాత ప్రదేశాల్లో ఉంచడం ఏమిటని ప్రశ్నించారు. కొత్త ఉపాధ్యాయులు వచ్చినందున అందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, చిన్న నరసింహులు, శ్రీనివాస్, అంబర్‌నాథ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

స్థిరాస్తి వ్యాపారానికి కుంట పూడ్చివేత

గత ప్రభుత్వ పెద్దల సహకారంతో మాస్టర్ ప్లాన్‌లోనూ తొలగింపు

వెంచర్ ఏర్పాటుకు అనుమతి నిరాకరించిన జిల్లా ఉన్నతాధికారి

నిఘా

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం: మహబూబ్‌నగర్ పట్టణం నడిబొడ్డున దేవుడి పేరిట ఏర్పాటైన కాలనీ. ఉన్నత వర్గాలు నివాసముండే ఈ ప్రాంతంలో స్థిరాస్తి వ్యాపారులు ఏర్పాటు చేయాలనుకున్న వెంచర్‌కు జిల్లా ఉన్నతాధికారి అనుమతి నిరాకరించటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రూ. కోట్ల విలువైన భూమిలో వెంచర్ ఏర్పాటుకు అనుమతులు దక్కకపోవడంతో స్థిరాస్తి వ్యాపారులు రాజకీయంగా పురపాలిక యంత్రాంగంపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెంచుతున్నారు. వెంచర్ ఏర్పాటుకు అనుమతులు నిరాకరించిన ఉన్నతాధికారి వద్దకు ఏ దస్త్రాలతో వెళ్లి అనుమతులు వచ్చేలా చేయాలో అర్థం కాక మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారి వెంచర్ ఏర్పాటుకు ఎందుకు అనుమతులు నిరాకరించారో తెలిస్తే ఒకింత ఆశ్చర్యం కలగక మానదు.

కనుమరుగు చేశారిలా.. : కాలనీ ఏర్పాటుకు ముందు ఓ రెవెన్యూ గ్రామ పరిధి ప్రైవేటు పట్టా భూమిలో నీటి కుంట ఉండేది. ఆ గ్రామం పురపాలికలో విలీనయ్యాక అర్బన్ మండలం పరిధిలోకి వచ్చింది. కుంటను 2010 మాస్టర్ ప్లాన్‌లో గ్రీన్ జోన్‌గా నిర్ధారించగా ఆ పట్టా భూమివారు జీర్ణించుకోలేకపోయారు. వారు తమ ఆలోచనకు పదును పెట్టారు. గత ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన నేత సహకారంతో కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి 2022లో తొలగింపజేయించి ఆ భూమిని స్థిరాస్తి వ్యాపారులకు విక్రయించారు. కాలనీకి ఏకైక నీటి వనరుగా ఉన్న కుంటను కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు ఐదు నెలల క్రితం రాత్రికి రాత్రే పొక్లెయిన్లతో పూడ్చేసి చదును చేసే ప్రయత్నం చేశారు. అప్పట్లో టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా స్థిరాస్తి వ్యాపారులు మాస్టర్ ప్లాన్‌లో కుంట తీసేసిన దస్త్రాలు, గెజిట్ నోటిఫికేషన్ పత్రాలు చూపించి వెనక్కి పంపించేశారు. ఇటీవల కుంట స్థలాన్ని చదును చేసి భారీ వెంచర్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకున్న స్థిరాస్తి వ్యాపారులు టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వారా జిల్లా ఉన్నతాధికారి అనుమతి కోసం వారం క్రితం దస్త్రం పంపించారు. దస్త్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారి కుంటను పూడ్చేసి వెంచర్ ఏర్పాటు చేయడమేమిటంటూ అనుమతి నిరాకరించినట్లు సమాచారం. ఉన్నతాధికారి అనుమతి నిరాకరించడంతో అటు టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇటు స్థిరాస్తి వ్యాపారులు కంగుతిన్నారు. ఎలాగైనా జిల్లా ఉన్నతాధికారి అనుమతి పొందాలన్న పట్టుదలతో స్థిరాస్తి వ్యాపారులకు సంబంధించిన ఓ సర్వేయర్ పురపాలిక కమిషనర్‌తో తీవ్రస్థాయిలో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారి నీటి వనరుగా ఉన్న కుంటలో స్థిరాస్తి వ్యాపారానికి అనుమతులు ఇస్తారా లేక కుంటను మాస్టర్ ప్లాన్ నుంచి ఎందుకు తొలగించారని సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటారా అనేది వేచి చూడాల్సిందే.

శిక్షణకు 42 మంది ఏఎస్సైల ఎంపిక


మహబూబ్‌నగర్‌లోని కవాతు మైదానంలో సాధన చేస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలో 42 మంది ఏఎస్సైలు ఎస్సై శిక్షణకు ఎంపికయ్యారు. వారికి ఈ నెల 22 నుంచి 12 వారాల పాటు హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట్రామారెడ్డి పోలీస్ అకాడమిలో శిక్షణకు ఇస్తారు. ఇందుకు జోగులాంబ జోన్ డీఐజీ ఎస్ఎస్ చౌహాన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 16 మంది, మహబూబ్‌నగర్ నుంచి 10, వనపర్తి నుంచి 09, జోగులాంబ గద్వాల నుంచి ఐదుగురు, నారాయణపేట జిల్లా నుంచి ఇద్దరు చొప్పున ఎంపికయ్యారు. 1986, 1987, 1989 కానిస్టేబుల్ బ్యాచ్‌లకు చెందిన వారిలో ప్రస్తుతం ఏఎస్సైగా పనిచేస్తున్న వారికి శిక్షణ ఇవ్వనున్నారు. వారంతా 2021లో నిర్వహించిన శాఖాపరమైన రాత పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 21న వారంతా హైదరాబాద్‌లో రిపోర్టు చేయనున్నారు. శిక్షణ తర్వాత అన్ని విభాగాల్లో ఉత్తీర్ణత సాధిస్తే వారిని ఖాళీలు ఉన్న పోలీస్ స్టేషన్లలో ఎస్సైలుగా నియమిస్తారు. ఖాళీలు లేకపోతే వారు ప్రస్తుతం పనిచేస్తున్న స్టేషన్లలోనే ఏఎస్సైలుగా కొనసాగుతారు. జోగులాంబ జోన్ పరిధిలో ఎస్సై పోస్టులు ఖాళీగా ఏర్పడితే ఆ ఏఎస్సైలకు పదోన్నతి కల్పించి నియమిస్తారు.

రిజర్వులో మరో ఐదుగురు సిద్ధం : ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సివిల్ ఏఎస్సైలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారిలో శిక్షణకు వెళ్లడానికి ఇష్టం లేకపోయినా, అనారోగ్య కారణాలతో ఇబ్బందులు పడుతున్నా, వారి స్థానాల్లో తర్వాత సీనియారిటీ జాబితాలో ఉన్న వారికి అవకాశం కల్పిస్తారు. ఇందుకు మరో ఐదుగురి పేర్లతో జాబితా సిద్ధం చేశారు. ఎస్సై నిర్వర్తించే అన్ని రకాల విధులపై శిక్షణ పొందుతారని పోలీసు శాఖ వర్గాలు తెలిపాయి. వైద్యపరమైన పరీక్షలు చేసుకొని ధ్రువ పత్రాలను తీసుకుని వెళ్లాలని వారు కోరారు.

అందినోళ్లకు అందినంత

మక్తల్ మార్కెట్‌ను మింగేశారు


వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

న్యూస్‌టుడే– మక్తల్ పట్టణం


ఒకప్పుడు మక్తల్ వ్యవసాయ మార్కెట్ అంటే ఘనమైన చరిత్ర... ప్రస్తుతం గద్వాల, పెబ్బేరు, బాదేపల్లి మార్కెట్లలా రైతులు పండించే అన్ని రకాల ధాన్యాన్ని వ్యాపారులు స్థానికంగా కొనుగోలు చేసి రైతులకు మేలు చేసేవారు. పది ఎకరాల విస్తీర్ణం, 42 మంది అధీకృత వ్యాపారులు, సుమారు 300 గ్రామాల నుంచి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు లారీల రాకపోకలతో వ్యవసాయ మార్కెట్ కిటకిటలాడేది. క్రమేణా రాజకీయ నాయకులు రంగ ప్రవేశం, అధికారులు పట్టించుకోనితనం, వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో మార్కెట్ కుదేలైంది.

● 1961లో మక్తల్ నగర పంచాయతీగా ఉన్నప్పుడు పట్టణ అధికారులు, నాయకులు వ్యవసాయ మార్కెట్ ఉండాలని తీర్మానించి సర్వే నెం.44లో పది ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో ప్లాటు 400ల గజాల చొప్పున 42 దుకాణ సముదాయాల కోసం భూమిని కొనుగోలు చేసి వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేశారు. ఫలితంగా రైతులకు ఎంతో మేలు జరిగింది. రోజురోజుకూ వృద్ధి చెంది 1995 వరకు ఓ వెలుగు వెలిగింది. సాలీనా ప్రభుత్వానికి రూ. 3కోట్ల ఆదాయం వచ్చే స్థాయికి ఎదిగింది.

నాయకుల కన్ను

పట్టణ పరిధి పెరగడంతో క్రమేణా మార్కెట్ నడిబొడ్డులోకి వచ్చింది. 1961 ప్రణాళికలో మార్కెట్ చుట్టూ 50 అడుగుల స్థలం వదిలారు. ఈ స్థలానికి గజానికి రూ.లక్షల్లో డిమాండ్ పెరగడంతో మెల్లగా రాజకీయ జోక్యం పెరిగి ఆక్రమణలు మొదలయ్యాయి. కేటాయించిన స్థలాలు చేతులు మారడం, కోర్టుల్లో కేసులు వేయించి భయపెట్టడం వంటి చర్యలతోపాటు వ్యాపారులు కూడా చేతులు కలపడంతో రైతులు రావడం తగ్గించేశారు. రూ.3కోట్ల ఆదాయం కాస్త రూ.10లక్షల వరకు పడిపోయింది.

దారులు ఆక్రమించి : మార్కెట్‌కు నలువైపులా నాలుగు ప్రవేశ ద్వారాలు ఉండాలని అప్పట్లో భావించారు. ప్రవేశ ద్వారాల ప్రదేశాలను ప్లాట్లుగా మార్చి ఆక్రమించుకున్నారు. ఫలితంగా నలువైపులా స్థలం మింగేశారు. కేవలం జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రోడ్డు మాత్రమే మిగిలింది. ప్రస్తుతం వ్యవసాయ మార్కెట్‌లోకి ప్రవేశిస్తే ఆవేదన కలుగుతుంది. వ్యాపారులు తమకు కేటాయించిన దుకాణాలు కూల్చి వాటి స్థానంలో బహుళ అంతస్థుల భవనాలు నిర్మించి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ శీతల పానీయాల దుకాణాలు, హోటళ్లు, క్రిమి సంహారక మందుల దుకాణాలు, ప్రయివేటు పాఠశాలలు, టెంట్‌హౌజ్‌లు వంటి వ్యాపారాలు నడుస్తున్నాయి. ఒకప్పుడు 42మంది వ్యాపారులు లైసెన్సు పొంది లావాదేవీలు నిర్వహించారు. ప్రస్తుతం నామమాత్రంగా కేవలం 8మందికి మాత్రమే లైసెన్స్ ఉంది. వారు కూడా వేపపండ్ల మార్కెట్‌గా మాత్రమే మిగిల్చారు.



1961లో మార్కెట్ లే అవుట్ ప్లాన్

పంట మనది.. ఆదాయం కర్ణాటకది..: రైతులు పంటలను వేరే మార్కెట్‌లకు లేదా పక్క రాష్ట్రంలోని రాయచూరు మార్కెట్‌కు తరలిస్తుండటంతో మనకు రావాల్సిన ఆదాయానికి గండిపడుతుంది. మక్తల్ నియోజకవర్గంలో కృష్ణా నది, భీమా ప్రాజెక్టులోని రెండు జలాశయాలు, పెద్దవాగు ప్రవహిస్తుండటంతో లక్ష పైచిలుకు ఎకరాల్లో వరిధాన్యం పండుతోంది. ఈ ధాన్యం మొత్తం పక్క రాష్ట్రానికి వెళ్తుండటం శోచనీయం.

రెడ్‌క్రాస్ భవనానికి చేయూత అందించండి

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ సమీకృత భవనం నిర్మించడానికి చేయూత అందించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే గురువారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్‌ను జిష్ణుదేవ్‌వర్మను కలిసి ఈ మేరకు విన్నవించారు. జిల్లా కేంద్రంలోని సువిశాలమైన ప్రాంగణంలో రెడ్‌క్రాస్ భవనాన్ని నిర్మించి అన్ని రకాల సదుపాయాలను కల్పించాలన్నారు. రక్తనిల్వ కేంద్రాన్ని విస్తృతపరచి, ఆధునాతన ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఓపీ సేవలు అందించేలా వైద్యులను నియమించాలని కోరారు. అన్ని వసతులతో రక్త పరీక్షల కేంద్రాన్ని కూడా నిర్మించాలన్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో వృద్ధులకు ఆశ్రమాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచాక మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విద్యాభివృద్ధికి చేపట్టిన చర్యలను గవర్నర్‌కు వివరించారు. 200 మంది పేద, నిరుపేద విద్యార్థులకు నీట్, ఎంసెట్‌లో శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. రానున్న పదేళ్లలో 20వేల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించటమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. త్వరలోనే తాను మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి వస్తానని గవర్నర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే, రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు శ్రీరాములు, నటరాజ్, కాంగ్రెస్ నాయకులు మారేపల్లి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





నువ్వులు విరిశాయి!

విరబూసిన పూలతో నువ్వుల పంట కనువిందు చేస్తోంది. భూత్పూర్ మండలం గోప్లాపూర్ శివారులో ఓ రైతు నువ్వుల పంట సాగుచేశారు. ప్రస్తుతం ఆ పంట పూత దశలో ఉంది. లేత గులాబీ వర్ణంలో విరిసిన పూలతో అక్కడేదో పూలతోట ఉన్నట్లుగా కనిపిస్తోంది. పూలలోని మకరందాన్ని గ్రోలుతూ తేనెటీగలు సందడి చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్న ఆ దృశ్యాలను 'ఈనాడు' క్లిక్ మనిపించింది. - ఈనాడు, మహబూబ్‌నగర్

బడికెళ్లాలంటే ఎన్ని కష్టాలో!



శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వడ్డేపల్లి మండలం కోయిదిన్నె నుంచి 6 కి.మీ. ప్రయాణించి 20 మంది, మానవపాడు మండలం మద్దూరు నుంచి 12 కి.మీ ప్రయాణించి 40 మందికి పైగా విద్యార్థులు వస్తున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరంతా ప్రైవేటు వాహనాలు, సైకిళ్లపై వస్తున్నారు. ఇలా ప్రతి నెలా వీరు రూ.600 - 900 వరకు రవాణా కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది.



ఊట్కూరు: కాలినడకన మక్తల్ ఉన్నత పాఠశాలకు నడచివెళుతున్న ఊట్కూరు మండలం పెద్దపొర విద్యార్థులు వీరు. సుమారు నాలుగు కిలోమీటర్లు నడిచి స్టేజీ వరకువెళ్లి అక్కడ నుంచి 12 కి.మీ. దూరంలోని మక్తల్‌కు బస్సుపై చేరుకుంటారు. రోజూ సుమారు 50 మంది విద్యార్థులు ఇలా వెళుతుంటారు. గ్రామానికి తారురోడ్డున్నా బస్సు సౌకర్యం మాత్రం లేదు.

రవాణా భత్యమూ చెల్లించని ప్రభుత్వం | గ్రామాలకు నిలిచిన ఆర్టీసీ బస్సులు

న్యూస్‌టుడే, గద్వాల న్యూటౌన్, అయిజ

బడి కెళ్లడానికి విద్యార్థులు నానా కష్టాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో వందలాది గ్రామాల విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి ఇబ్బందులు పడుతూ ప్రమాదకర ప్రయాణాలు చేస్తూ పాఠశాలలకు చేరుకుంటున్నారు. ఇలాంటి వారికి ప్రభుత్వం గతంలో రవాణా భత్యం అందించేది. ప్రస్తుతం విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా.. నిధులు విడుదల కాకపోవడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులపై ఆర్థిక భారం పడుతోంది. కొన్ని గ్రామాల్లో తల్లిదండ్రులు ఏకంగా పిల్లలను బడి మాన్పించేస్తున్న పరిస్థితి ఉంది.

ఐదు వేలకుపైగా: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో 3.20 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో దాదాపు నాలుగు వందలకుపైగా పాఠశాలలు విద్యార్థులకు దూరంగా ఉంటున్నాయి. దూరం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భత్యం చెల్లించాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కిలోమీటరు దూరం వెళ్తుంటే.. 1 - 5వ తరగతి వారికి నెలకు రూ.400 చొప్పున, 3 కి.మీ. దూరం నుంచి వస్తున్న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.600 చొప్పున చెల్లించేవారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 5 వేల మందికి ఈ భత్యం చెల్లించాల్సి ఉంది. ఏటా విద్యాశాఖ ప్రతిపాదనలు పంపుతున్నా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు.

ఇవిగో కొన్ని..

- వనపర్తి జిల్లా అమరచింత ఉన్నత పాఠశాలకు 6 కిలోమీటర్ల దూరంలో ధర్మాపురం నుంచి 10 మందికిపైగా విద్యార్థులు వస్తుంటారు. మూడు కి.మీ. దూరంలోని చంద్రానాయక్‌తాండా నుంచి 20 మందికి పైగా వస్తుంటారు. ఈ రెండు గ్రామాలకు బస్సు లేదు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే. ఆరు కి.మీ. దూరంలోని కొంకలవానిపల్లె నుంచి 30 మందికిపైగా విద్యార్థులు వస్తుంటారు.
- రాజోలి మండలం తుమ్మిళ్ల గ్రామం నుంచి 5 కి.మీ. దూరంలోని పెద్దతాండ్రపాడుకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేదు. ఆడపిల్లలను సైకిళ్లపై పంపలేక పది మందికి పైగా బాలికలను వారి తల్లిదండ్రులు బడి మాన్పించారు.
- గద్వాల జిల్లా రాజోలి, అయిజ, వడ్డేపల్లి, ఉండవల్లి, మల్దకల్ మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. సైకిళ్లపై వస్తూ కొందరు ప్రమాదాలకు గురవుతున్నారు. కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తూ.. ప్రతి రోజూ రూ.30 - రూ.50 పైగా ఖర్చు చేస్తున్నారు.

రవాణా భత్యం అందించాలి



నేను, నాతో పాటు మరో 30 మంది కలిసి మా గ్రామం నుంచి చదువుకోవడానికి 12 కి.మీ. దూరంలోని శాంతినగర్ ఉన్నత పాఠశాలకు వెళ్తున్నాం. బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రైవేటు వాహనాల్లో మాట్లాడుకుని వస్తున్నాం. మా లాంటి వారి కోసం ప్రభుత్వం రవాణా భత్యం ఇస్తారని సార్లు చెప్పారు. ఇప్పటి వరకు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలి. **-ఆనంద్, 8వ తరగతి, తుమ్మిళ్ల**

ఉన్నతాధికారులకు తెలిపాం

విద్యార్థులకు రవాణా భత్యం అందించడానికి ఏటా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు నివేదిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు. అయితే, గతేడాది కొందరు విద్యార్థుల ఖాతాల్లో ఒక ఏడాదికి సంబంధించిన డబ్బులు పడినట్లుగా చెప్పారు. మాకు మాత్రం అధికారికంగా రాలేదు. మరోసారి సమస్యను ఉన్నతాధికారులకు విన్నవిస్తాం.
-శాంతిరాజు, జిల్లా విద్యాశాఖ సమన్వయ అధికారి, గద్వాల



జడ్చర్ల న్యూటౌన్: మిడ్జిల్ మండలం వస్పుల ప్రభుత్వ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు వీరు. వల్లభరావుపల్లి, లింబ్యాతండా, దోనూరు, కంచెనపల్లి తదితర గ్రామాల నుంచి సుమారు 40 మంది విద్యార్థులు నిత్యం నాలుగు కిలోమీటర్ల దూరం ఇలా నడిచి, లేదా ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి రావాల్సిందే.

అండర్-14 క్రికెట్ విజేత మహబూబ్‌నగర్



మహబూబ్‌నగర్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్

గద్వాల పట్టణం, న్యూస్‌టుడే: గద్వాల ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన అండర్-14 బాలుర రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. రాష్ట్రం నుంచి పది జిల్లాల జట్లు హాజరు కాగా, మహబూబ్‌నగర్ ప్రథమ, రంగారెడ్డి, హైదరాబాద్ సంయుక్తంగా ద్వితీయ, నల్గొండ తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి జితేందర్ తెలిపారు. అనంతరం విజేతలకు జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్ ట్రోఫీ అందజేశారు. ఈ క్రమంలో పతకాలను, ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదుగా బహూకరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కన్వీనర్ శ్రీనివాసులు తెలియజేశారు. జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి బీఎస్ ఆనంద్, సూపరింటెండెంట్ రామకృష్ణారావు, విజయ్‌పాల్, కృష్ణయ్య, బీసన్న పాల్గొన్నారు.

19న బిజినేపల్లిలో ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లను ఈనెల 19న బిజినేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల (బాలుర) మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఖోఖో సంఘం కార్యదర్శి విలియం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆధార్, బోనఫైడ్‌తో ఉదయం 9 గంటలకు మైదానంలో నివేదించాలని కోరారు. వివరాలకు 95531 24166, 94934 50450 నంబర్లలో సంప్రదించాలన్నారు. రాష్ట్రస్థాయి ఖోఖో జూనియర్స్ టోర్నీ త్వరలో మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలోకి నేడు సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు



మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడలకు ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా టోర్నీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేసేందుకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా ఈ నెల 3న ఎల్బీ స్టేడియంలో 10 కి.మీ.ల సీఎం కప్ క్రీడాజ్యోతి పరుగు పందెం నిర్వహించింది. ఇదే రోజు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో సీఎం కప్ క్రీడాజ్యోతి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఇది రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల మీదుగా ఈనెల 21 వరకు 33 జిల్లాల్లో 2,830 కి.మీ.ల సాగుతుంది. ఈ వాహన ర్యాలీ ఈనెల 18న ఉమ్మడి జిల్లాలో ప్రవేశిస్తుంది. అయిదు జిల్లాల్లో ఈ నెల 20 వరకు కొనసాగుతుంది. జిల్లాల యువజన క్రీడల అధికారులు, క్రీడా సంఘాలు క్రీడాజ్యోతి వాహన ర్యాలీని జయప్రదం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాల వారీగా 10కే రన్ : ఈ నెల 18న ఉదయం నాగర్‌కర్నూల్‌లోని కొత్త కలెక్టరేట్ నుంచి లిటిల్ ఫ్లవర్ పాఠశాల వరకు 10 కి.మీ.ల పరుగు పందెం కొనసాగనుంది. ఇదే రోజు సాయంత్రం వనపర్తి జిల్లాలోని చిట్యాల నుంచి కలెక్టరేట్ వరకు పరుగు నిర్వహిస్తారు. ఈనెల 19న ఉదయం జోగులాంబ గద్వాల జిల్లా ధరూరు సంగాల పార్కు నుంచి గద్వాలలోని కలెక్టరేట్ వరకు, ఇదే రోజు సాయంత్రం నారాయణపేట జిల్లాలో తిప్రాస్‌పల్లి నుంచి పట్టణంలోని నర్సిరెడ్డి చౌరస్తా వరకు పరుగు కొనసాగుతుంది. ఈ నెల 20న మహబూబ్‌నగర్‌లో క్రీడాజ్యోతి పరుగు డీఎస్‌ఏ మైదానం నుంచి మెట్టుగడ్డ వరకు నిర్వహిస్తారు. యువజన, క్రీడల శాఖ సిబ్బంది, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొంటారు.

ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు

నల్గొండ నుంచి వచ్చే వాహన ర్యాలీ ఈనెల 18న చారకొండలో ప్రవేశిస్తుంది. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొడంగల్, సవాయిగూడెం, పెబ్బేరు, ఎర్రవల్లి, జమ్మిచేడు మీదుగా చిట్యాలకు చేరుతుంది. 19న వనపర్తి కలెక్టరేట్, ఆత్మకూరు, జక్లేర్ ధన్వాడ, జాజాపూర్, మరికల్, బండ్రవల్లి, తిప్రాస్‌పల్లిలో, 20న నారాయణపేట, దేవరకద్ర, ధర్మాపూర్, హన్వాడ, పరిగి, కడ్తాల్, మహేశ్వరం, పెద్దఅంబర్‌పేట, తిమ్మాయిపల్లి మీదుగా మంకాల్‌కు చేరుకుంటుంది. ఉమ్మడి జిల్లాలో 370 కి.మీ.లు ర్యాలీ సాగుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్ చెప్పారు.

కురుమూర్తి జాతరకు పక్కా ఏర్పాట్లు: కలెక్టర్



గోడపత్రికను విడుదల చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీకురుమూర్తి స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. కురుమూర్తి స్వామి జాతర మైదానంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీలకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 31 నుంచి నవంబరు 18 వరకు స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉద్దాల రోజున 3 లక్షల మంది భక్తులొచ్చే అవకాశం ఉందని భక్తులకు అన్ని వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు సరిపడా బస్సులు అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. రహదారులకు మరమ్మతులు చేపట్టాలన్నారు. జాతర మైదానంలో పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరులో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి 24 గంటలు భక్తులకు సేవలందేలా చూడాలన్నారు. 24 గంటలూ విద్యుత్తు, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు గ్రామపంచాయతీలు, పురపాలికల నుంచి సిబ్బందిని కేటాయించాలన్నారు. 108 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. పార్కింగ్, బారికేడింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. జాతరలో మద్యం విక్రయాలు జరగకుండా ఆబ్కారీ అధికారులు చూడాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు, మహిళలకు షీటీంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, ఆలయ ఛైర్మన్ గోవర్ధన్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి పద్మ, ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీదేవి, డీపీవో పార్థసారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మానవపాడు, న్యూస్‌టుడే: మండల పరిధిలో 23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడ్డాయని ఎస్సై చంద్రకాంత్ తెలిపారు. మండలంలోని జల్లాపురం గ్రామానికి చెందిన ఎరుకలి రవి నుంచి 16 క్వింటాళ్లు, పెద్దపోతులపాడు గ్రామంలో కాసీం నుంచి 7 క్వింటాళ్ల బియ్యాన్ని వనపర్తి జిల్లాలోని పెబ్బేరుకు చెందిన విజయ్, కృష్ణయ్య, ఇటిక్యాల మండలంలోని కొండేరుకు చెందిన వెంకటరాముడు, శివ కొనుగోలు చేసి అశోక్ లే ల్యాండ్ ఆటోలో పెబ్బేరుకు తరలిస్తున్నారు. అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించి బియ్యంతో పాటు ఆటోను స్వాధీనం చేసుకొని ఠాణాకు తరలించామన్నారు. జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ బ్రహ్మయ్య ఫిర్యాదు మేరకు పైఆరు మందితో పాటు ఆటో డ్రైవర్ సురేందర్‌పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బోయపల్లి యువకుడి సైకిల్‌యాత్ర



మహబూబ్‌నగర్ సాంస్కృతికం, మహమ్మదాబాద్ : సనాతన ధర్మ పరిరక్షణ ఆవశ్యకత వివరించేందుకు మహబూబ్‌నగర్ పట్టణ సమీపం బోయపల్లికి చెందిన యువకుడు మల్లేశ్‌గౌడ్ సైకిల్‌యాత్రకు శ్రీకారం చుట్టారు. గురువారం బోయపల్లి గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయంలో పూజల తర్వాత యాత్ర ప్రారంభించారు. మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ సనాతన ధర్మ ఔన్నత్యం, దాని పరిరక్షణ ఆవశ్యకతను వివరిస్తూ రోజూ 100 కి.మీ.లు సైకిల్‌యాత్ర చేసి స్థానిక ఆలయాల్లో బస చేస్తానని తెలిపారు. ఏడాది పాటు కొనసాగే ఈ యాత్రలో భాగంగా దేశంలోని 12 జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా మల్లేశ్‌గౌడ్‌ను అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్, స్థానిక వివిధ యువజన సంఘాలు, ఆలయ కమిటీల ప్రతినిధులు సన్మానించారు. మహమ్మదాబాద్ శివారులో హిందూ వాహిని సభ్యులు శ్రీనివాస్, రఘు, రాకేశ్ తదితరులు స్వాగతం పలికి సన్మానించారు.

కనుల పండువగా కల్యాణం



మంగళసూత్రాలు చూపిస్తున్న పురోహితులు

మల్దకల్, న్యూస్‌టుడే: ఆశ్వీయుజమాసం గురువారం పౌర్ణమి సందర్భంగా మల్దకల్ ఆదిశిలాక్షేత్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిశిలావాసుడి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, గోపూజ, పవమాన హోమం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, అలంకరణ, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం, పల్లకీసేవ, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఊంజలసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈవో సత్యచంద్రారెడ్డి, ఛైర్మన్ ప్రహ్లాదరావు, అశోక్‌కుమార్, ముకుందరావు, చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలను కల్యాణానికి తెస్తున్న పూజారులు

ఇంటి నుంచి బయటకెళ్లి.. చెరువులో శవమై..



కిశోర్‌కుమార్

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: మతిస్థిమితం లేని యువకుడు సరూర్‌నగర్ చెరువులో శవమై కనిపించిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రకు చెందిన కాట్రమోని కిశోర్‌కుమార్ (34) తల్లిదండ్రులు, సోదరులతో కలిసి కొంతకాలంగా నగరంలోని నందనవనంలో నివసిస్తున్నారు. కూలీ పనులు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. అయితే కొంతకాలంగా మతిస్థిమితం లేకపోవడంతో కూలీ పనులు మానేశాడు. ఈ నెల 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి.. తిరిగిరాలేదు. గురువారం చెరువులో మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో నుంచి పడి యువకుడి మృతి

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్- బీజాపూర్ రహదారిపై ఆటోలో నుంచి పడి ఒకరు మృతిచెందిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మర్కల్ గ్రామానికి చెందిన పుట్ట శంకర్(19) హైదరాబాద్‌లోని చేపల వ్యాపారి వద్ద పనిచేస్తున్నాడు. నగరం చుట్టూ జరిగే సంతల్లో చేపలను విక్రయించడానికి నిత్యం ఆటోలో వెళ్లేవాడు. ఈ క్రమంలోనే చేవెళ్ల మార్కెట్లో చేపలు అమ్మేందుకు మరో ముగ్గురితో కలిసి బయల్దేరాడు. కేసారం గేటు సమీపంలోకి రాగానే ఆటో అదుపుతప్పి ఒకవైపు ఒరగడంతో అందులో నుంచి శంకర్, రాములు రోడ్డుపై పడిపోయారు. శంకర్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాములు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


కుటుంబ సభ్యుల చెంతకు చేరిన యువకుడు



కుటుంబ సభ్యులకు చరణ్ (కుడినుంచి మూడో వ్యక్తి)ను అప్పగిస్తున్న ఎస్సై మంజునాథరెడ్డి, యువకులు

కొత్తకోట గ్రామీణం, న్యూస్‌టుడే : రెండేళ్ల కిందట అదృశ్యమైన ఓ యువకుడు సామాజిక మాధ్యమం ద్వారా కుటుంబసభ్యుల చెంతకు చేరారు. వనపర్తి జిల్లా కొత్తకోట ఎస్సై మంజునాథరెడ్డి కథనం ప్రకారం.. శంషాబాద్‌కు చెందిన రాములుకు కుమారుడు చరణ్ (20), ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడికి చిన్నప్పటి నుంచి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవారు. రెండేళ్ల క్రితం రాములు ఇల్లు కూలిపోయింది. సమీపంలో ఉన్న బంధువుల ఇంటికి సామగ్రి తరలించే క్రమంలో కుమారుడు కనిపించకుండా పోయారు. అతని కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చరణ్ ఎక్కడెక్కడో తిరుగుతూ వారం క్రితం కొత్తకోటకు చేరారు. ఇక్కడ ఉన్న యువకులు విష్ణువర్ధన్, రఘు, శ్రీకాంత్‌తో అతను చనువుగా ఉండటంతో పాటు ఇన్‌స్టాగ్రామ్‌ను చూస్తూ పాటలకు నృత్యాలు చేసేవారు. అతని పేరిట వారు ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరచి అతను చేసిన నృత్యాల వీడియోలు పోస్టు చేశారు. వాటిని 14 లక్షలకు పైగా మంది వీక్షించారు. రాములు కుటుంబసభ్యులు చూసి కొత్తకోట యువకులకు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. వీడియో కాల్ చేయడంతో చరణ్ తన తండ్రి, అక్కలను గుర్తు పట్టారు. గురువారం కొత్తకోట పోలీసు స్టేషన్‌కు చేరుకున్న రాములుకు చరణ్‌ను అప్పగించామని ఎస్సై తెలిపారు. యువకుడిని కన్నవారి చెంతకు చేర్చిన యువకులను ఆయన అభినందించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి బలవన్మరణం



వీరశేఖర్ (పాత చిత్రం)

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: మనోవేదనతో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు. గద్వాల పుర పరిధిలోని నల్లకుంటకు చెందిన వీరశేఖర్ (50) ఎర్రవల్లి మండలం కోదండాపురం జడ్పీహెచ్‌ఎస్‌లో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజులుగా మనోవేదనతో బాధపడుతున్న అతడు తన బాధను కుటుంబ సభ్యులకు వివరించారు. ఆయనకు ధైర్యం చెప్పారు. అయినప్పటికీ గురువారం సాయంత్రం ఇంటి నుంచి బయటికెళ్లిన ఆయన గద్వాల రైల్వే స్టేషన్ సమీపంలోని రెండో రైల్వే గేటు(ఆర్వోబీ) వద్ద గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరశేఖర్‌కు భార్య మంజులాబాయి(తెలుగు పండిట్), కుమార్తెలు విజ్ఞత (18), వినూత్న(15) ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120-00
రిటైల్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

తెరపై ఈనాడు

దేవర: మనోహర్(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనమాల(కోస్గి), **విశ్వం:** మహేశ్వరి (నారాయణపేట) - న్యూస్‌టుడే, నారాయణపేట పాతబస్టాండ్

కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ. 70, వంకాయలు రూ. 60, ముక్క వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ. 50, కాకరకాయ రూ. 80, క్యారెట్ రూ. 80, బెండకాయలు రూ. 60, బీరకాయలు రూ. 80, దొండకాయలు రూ. 60, పచ్చిమిర్చి రూ. 50, చిక్కుడు రూ. 70, పెద్ద చిక్కుడు రూ. 80, గోకరకాయ రూ. 70, క్యాప్సికం 80, బీన్స్120, క్యాలీఫ్లవర్ రూ. 80, దోసకాయ రూ. 60, క్యాబేజీ రూ. 50, ఉల్లి రూ. 50, చింతపండు రూ. 110.
-న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్)

జిల్లాలో ఈనాడు

ధన్వాడ: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి శుక్రవారం ధన్వాడ, గోటూర్ గ్రామాల్లో పర్యటించనున్నారని సింగిల్ విండో అధ్యక్షుడు వై. వెంకటరామిరెడ్డి తెలిపారు.

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : కాట్రేవుపల్లి గ్రామంలో కొత్తగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయం వద్ద ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత రెండు



కాట్రేవుపల్లిలో ఎల్లమ్మ ఉత్సవాల్లో భక్తులు

రోజులుగా వేద పండితులతో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, భాజపా రాష్ట్ర నాయకుడు బి. కొండయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్ఈడీ దీపాల వితరణ

నర్వ, న్యూస్‌టుడే : నర్వ మండలంలోని లంకాల గ్రామంలోని పలు కాలనీల్లోని స్తంభాలకు ఐదేళ్ల వీధి దీపాలను భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి వితరణ చేశారు. ఎంపీ ఎన్నికల్లో డీకే అరుణను గెలిపిస్తే దీపాలు వేయిస్తానని ఇచ్చిన హామీ మేరకు వీటిని ఏర్పాటు చేశానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలను సందర్శించి గ్రామస్థులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాజపా నాయకులు విజయరాం, చిన్నప్పన్న, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకోవాలని వినతి



ధన్వాడ తహసీల్దారుకు వినతి అందజేస్తున్న నాయకులు

ధన్వాడ, న్యూస్‌టుడే : అధిక వర్షాలతో పత్తి పంటను పూర్తిగా కోల్పోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా అధ్వర్యంలో గురవారం తహసీల్దారు సింధూజకు వినతిపత్రం అందజేశారు. రుణమాఫీ వర్తించని రైతులకు తక్షణమే నిధులు విడుదల చేయాలన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య, భాజపా మండల శాఖ అధ్యక్షుడు సురేందర్, నాయకులు లంకలి గోపి, శివరాజ్‌లతో పాటు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఏఈ బాధ్యతల స్వీకారం

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : కోస్గి మండల విద్యుత్ శాఖ ఏగా బోయ వెంకటేశ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. నారాయణపేట ఎస్పీఎం ఏఈగా విధులు నిర్వహించి కోస్గికి వచ్చారు. వినియోగదారులు సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇదే సందర్భంలో బదిలీపై వచ్చిన లైన్‌మెన్ రాంచందర్ ప్రవేశలేఖను కొత్త ఏఈకి అందజేశారుఉ.

మరికల్‌కు వెంకటరమణ

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : మరికల్ మండలం విద్యుత్తు ఏఈగా వెంకటరమణ నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ విద్యుత్ స్టోర్ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మరికల్‌లో పని చేస్తున్న రవికాంత్ మహబూబ్‌నగర్ స్టోర్‌కు బదిలీ అయ్యారు.

బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి



జక్లేర్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న జిల్లా కార్మికశాఖ అధికారి రాజ్‌కుమార్

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : బాలల హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం జక్లేర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వద్ద బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించి, బాలల హక్కులపై అవగాహన కల్పించి మాట్లాడారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై కేసు నమోదు చేయిస్తామన్నారు. బాలల సంరక్షణకు ప్రభుత్వాలు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ సంస్థ సమన్వయకర్త నర్సింహులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

శివ్వంపేట ఘటనతో పాఠం నేర్వాలి

న్యూస్‌టుడే- కోస్గి, మద్దూరు



కోస్గి నుంచి నాసన్‌పల్లి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే బంధం చెరువు

ఈనెల 16న సాయంత్రం కారులో శుభకార్యానికి వెళ్లి వస్తున్న ప్రయాణికులు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం ఉసిరికపల్లి శివారులో వాగులోకి బోల్తా పడడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. రోడ్డు పక్కనే వాగు ఉండటం, అజాగ్రత్తగా నడపడం ప్రమాదానికి కారణం. ఈ ఘటన మన జిల్లాలో రహదారులపై ప్రయాణించేవారికి మేలుకొలుపు కావాలి. పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే నేలబావులు ఉన్నాయి.

- మద్దూరు- ఖాజీపూర్ మధ్యలో సంగం చెరువు, మద్దూరు- భూనీడు రోడ్డులో నాగిరెడ్డికుంట ప్రమాదకరంగా ఉన్నాయి. మద్దూరు- నిడ్జింత మధ్య చెరువు కట్ట అధ్వానంగా ఉంది. ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. పెదిరిపాడు నుంచి మద్దూరుకు వచ్చే చెరువు కట్ట ఘోరంగా ఉంది. ఇక్కడ బీటీ ఏర్పాటుతో పాటు, రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంది.
- కోస్గి నుంచి పోతిరెడ్డిపల్లి దారిలో ఉప్పు సముద్రం, కోస్గి నుంచి నాసన్‌పల్లి రహదారిలో బంధం చెరువు, కోస్గి నుంచి గుండ్లపల్లి వెళ్లే దారిలో నాగుల చెరువు, పోతిరెడ్డిపల్లి నుంచి దాదాపూర్ మార్గంలో ధర్మంకుంట ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేవు. నిత్యం పెద్ద సంఖ్యలో వాహనాలు వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న భయం వెన్నాడుతోంది.
- మక్తల్ మండలం చిట్యాల వాగు వద్ద వంతెన నిర్మిస్తే గడ్రం దొడ్డి, కొల్పూర్, మందిపల్ గ్రామాలకు రాకపోకలు అనుకూలంగా ఉంటుంది. పెద్దవాగు దగ్గర ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. నేరేడ్‌గం, సత్యవార్ గ్రామాల దగ్గర వాగు వంతెన ప్రమాదాలకు తావిస్తోంది.
- నర్వ మండలం లంకాల, యాంకి చెరువుల పక్క నుంచి ప్రయాణించే వారు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.
- రాకొండ- పూసల్‌పాడ్ మార్గం చెరువుకట్టల మీదుగా సాగుతుంది.
- ధన్వాడ- పాతపల్లి, చర్లపల్లి నుంచి సీతర్లగడ్డ తాండ మార్గాల్లో ఇరుకైన కట్టలపై నుంచి ప్రయాణించాలి.
- ఊట్కూరు మండలం చిన్నపొర్ల- పెద్దపొర్ల, ఎడివెల్లి- చిన్నపొర్ల, చిన్నపొర్ల- పులిమామిడి మధ్యలో చెరువు కట్టలు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిపై రక్షణ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఏమాత్రం చినుకు పడినా అమీన్‌పూర్- సామన్‌పూర్, పగిడిమారి- నారాయణపేట మధ్యలో నీరుచేరి ప్రమాదాలకు తావిస్తోంది.
- దామరగిద్ద సమీపంలోని ఎల్లమ్మకుంట రోడ్డు పక్కనే ఉండగా ఎలాంటి రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో అది ప్రమాదకరంగా ఉంది. బాపన్‌పల్లి, క్యాతన్‌పల్లి రహదారుల పక్కన అనేక ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి.
- కృష్ణా మండలం గూడెబల్లూరు నుంచి ముడుమాల్ దారిలో బావి వద్ద తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలి.
- నారాయణపేట మండలం చిన్న జట్రం నుంచి పెద్ద జట్రంకు అలుగు పై నుంచి వెల్లవలసి ఉంది.

అప్రమత్తత అవసరం

వాహనాలను అతివేగంగా నడపడంతోనే చాలా వరకు ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్కువ వేగంతో అప్రమత్తంగా నడిపితే ప్రమాదాలను అంచనావేయవచ్చు. కొత్త ప్రాంతాలలో ప్రయాణించేటప్పుడు ఆ దారిలో ప్రమాదకర ప్రాంతాలు ఏముంటాయో ముందుగా తెలుసుకోవాలి.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎస్పీ యోగేశ్ గౌతం

నారాయణపేట, న్యూస్‌టుడే : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ యోగేశ్‌గౌతం అన్నారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు నిజామాబాద్‌లో నిర్వహించిన దక్షిణ భారతదేశస్థాయి తొలి ఇండియన్ మహిళల రోడ్ సీజన్ 10 కిలోమీటర్ల సైకిల్ పోటీల్లో పేట జిల్లా నుంచి 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మెదక్ జిల్లా రామాయంపేటలో జరిగిన మౌంటెన్ సైకిల్ రేస్‌లో పాల్గొన్న విద్యార్థులకు గురువారం జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో ప్రశంసా పత్రాలు, పతకాలు అందజేసి ఎస్పీ అభినందించారు. క్రీడల్లో రాణిస్తే రెండుశాతం క్రీడా కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆటల్లో ప్రతిభను వెలికి తీస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు గోపాలం, శ్రీనివాస్, స్వరూప, పుష్పలత, అమరేష్, దామోదర్, మధు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు సత్వరమే నగదు జమ

ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



నర్వలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నర్వ, న్యూస్‌టుడే : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సూచించారు. గురువారం నర్వ సహకార సంఘంలో ఛైర్మన్ ఎల్. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులకు త్వరితగతిన డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందస్తుగా గన్నీ బస్తాల ఏర్పాటు చేసుకోవాలని విండో సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షుడు ఎ. లక్ష్మణ్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్రెడ్డి, వివేక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చెన్నయ్యసాగర్, పి. జగన్మోహన్‌రెడ్డి, వివేకవర్ధన్ రెడ్డి, శరణప్ప, సంజీవరెడ్డి, కార్యాలయ సీఈవో ఉదయ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజుగా చేయడమే లక్ష్యం

ఊట్కూరు, న్యూస్‌టుడే : రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఊట్కూరు పీఏసీఎస్ కార్యాలయం వద్ద గురువారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. తహసీల్దార్ రవి, పీఏసీఎస్ ఛైర్మన్ ఎం. బాల్‌రెడ్డి, ఎంపీడీవో ధనుంజయ గౌడ్, నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో గణనీయ ఆదాయం



పేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : దసరా ఉత్సవాలు పురస్కరించుకుని అక్టోబరు ఒకటో తేదీ నుంచి 16 వరకు పలు రూట్లలో ప్రత్యేక సర్వీసులు నడిపామని, మంచి ఆదాయం వచ్చిందని నారాయణపేట ఆర్టీసీ డిపో మేనేజరు లావణ్య అన్నారు. గురువారం పేటలో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ రూట్‌లో 16 రోజుల్లోనే 100కు పైగా అదనపు ట్రిప్పులు నడిపించామన్నారు. గతంలో ఒక్కరోజు సుమారు రూ. 19లక్షల ఆదాయం రాగా, దసరా సందర్భంగా రోజుకు రూ. 23.5లక్షల ఆదాయం వచ్చిందన్నారు. అత్యధికంగా 14న రూ. 32 లక్షల ఆదాయం వచ్చిందన్నారు.

బస్సు సర్వీసులు నడిపించాలని వినతి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : జిల్లాలోని అన్ని గ్రామాలకు బస్సు సర్వీసులు నడిపించాలని పీడీఎస్‌యూ నాయకులు గురువారం ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్యకు వినతిపత్రం అందించారు. జిల్లా సహాయ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పలు గ్రామాల్లో బస్సు సౌకర్యం లేదన్నారు.

మానవాళికి మార్గదర్శి భగవద్గీత



సంక్షిప్త భగవద్గీత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తితిదే ఉమ్మడి జిల్లా బాధ్యుడు డా. ఉత్తరపల్లి రామాచారి తదితరులు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : భగవద్గీత మానవాళికి మార్గదర్శనం చేస్తుందని, పిల్లలు చిన్నప్పుడే గీత చదివేతే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తితిదే ఉమ్మడి జిల్లా బాధ్యుడు డా. ఉత్తరపల్లి రామాచారి అన్నారు. తితిదే, హిందూ ధర్మప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో ‘మానవులందరికీ భగవద్గీత’ పేరుతో ముద్రించిన పుస్తకాన్ని గురువారం మహబూబ్‌నగర్‌లోని తితిదే కల్యాణ మండపంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామాచారి మాట్లాడుతూ భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటంలో భగవద్గీత గొప్ప ప్రేరణగా నిలుస్తుందన్నారు. డా. విభీషణ శర్మ ప్రత్యేకంగా విద్యార్థుల కోసం శ్లోకం, భావంతో కూడిన వచన పుస్తకాన్ని వెలువరించారని, వాటిని పాఠశాల విద్యార్థులకు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. పుస్తకాలు కావాల్సిన ప్రధానోపాధ్యాయులు తితిదే కల్యాణ మండపంలో శుక్ర, శనివారాల్లో సంప్రదించాలని రామాచారి సూచించారు. ధార్మిక కమిటీ సభ్యులు కె. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భగవద్గీత ప్రతి హిందూ కుటుంబం వద్ద తప్పకుండా ఉండాల్సిన పవిత్రమైన గ్రంథమన్నారు. ధర్మాచార్యులు ఎం. రజనీ సంక్షిప్త భగవద్గీత పుస్తకాన్ని సమీక్ష చేశారు. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు సురేష్‌చంద్ దూత్, బి. రాములు, దామోదర్‌రెడ్డి, నరేశ్, ఎం. శ్రీరాములు, వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలకు రూ. 15 కోట్లు

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : నారాయణపేట నియోజకవర్గంలో పలు గ్రామాల్లో బీటీ రహదారుల నిర్మాణాలకు పీఆర్, ఆర్అండ్‌బీ శాఖల రూ. 15 కోట్లు మంజూరు అయినట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు సూర్యమోహన్‌రెడ్డి తెలిపారు. వీటికి త్వరలో టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టబోతున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఉత్తర్వులను గురువారం మరికల్‌లో విలేకరులకు అందజేశారు.

వాల్మీకి రామాయణం ఆదర్శనీయం



మక్తల్: వాల్మీకి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : వాల్మీకి జయంతి సందర్భంగా గురువారం మక్తల్ పట్టణంలోని స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో పలువురు నాయకులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, భాజపా రాష్ట్ర నాయకులు కొండయ్యలు మాట్లాడుతూ రామాయణం నేటికీ ఆదర్శనీయమని, వాల్మీకి చిరస్మరణీయుడన్నారు. వచ్చే జయంతి వేడుకలు వాల్మీకి మందిరంలోనే జరుపుకుంటామన్నారు. కిందిస్థాయి నుంచి ఆత్మజ్ఞానంతో అత్యున్నత స్థాయికి ఎదిగిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హన్మంతు, లక్ష్మారెడ్డి, రాజుల ఆశిరెడ్డి, నర్సింహాగౌడ్, చిన్న హన్మంతు, బలరాంరెడ్డి, రవికుమార్ కట్ట సురేష్, కావలి తాయప్ప, ఆనంద్ గౌడ్, దేవరింటి నర్సింహారెడ్డి, కర్ని స్వామిలు పాల్గొన్నారు.

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : అనుగొండ, కర్ని, గుడిగండ్ల, జౌళాపురం గ్రామాల్లో గురువారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, పి. చంద్రకాంత్, తిరుపతయ్య, రవికుమార్, కురువ రాజు, మేకల హన్మంతు, వడ్ల నర్సిములు, మెకానిక్ అంజి, కిష్టప్ప, తిరుపతి, శివ, వాల్మీకి సంఘం నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఊట్కూరు, న్యూస్‌టుడే : పెద్దపోర్ల వాల్మీకి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పులిమామిడిలో చిత్రపటానికి పూజలు నిర్వహించి, నివాళులు అర్పించారు. వాల్మీకి జీవిత విశేషాలు, రామాయణ పారాయణం వల్ల ప్రయోజనం గురించి వక్తలు వివరించారు. అనంతరం గజలమ్మ దేవాలయం వద్ద అన్నదానం నిర్వహించారు. పులిమామిడి మాజీ సర్పంచి చిన్న సూరయ్య గౌడ్, కుర్మయ్య, ఆంజనేయులు, చెన్నకేశవులు, తిర్మలేష్, చంద్రశేఖర్, అశోక్, మహేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : ఎక్లాస్‌పూర్ గ్రామంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. మరికల్ పట్టణంలోని వాల్మీకి ఆలయంలో విగ్రహానికి పంచామృతంతో అభిషేకించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రాసిన రామాయణ గ్రంథంపై వక్తలు మాట్లాడారు.

నర్వ, న్యూస్‌టుడే : మండలకేంద్రంలో వాల్మీకి సామూహిక భవనాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వాల్మీకుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని హామీ ఇచ్చారు. నాయకులు చెన్నయ్య సాగర్, డి. కృష్ణారెడ్డి, పి. జగన్మోహన్‌రెడ్డి, పోలీసు చంద్రశేఖర్‌రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు ఎం. లక్ష్మణ్, గడ్డం నర్సింహులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.





ధన్వాడ, మరికల్ పట్టణాలోని వాల్మీకి ఆలయాల్లో పూజలు

ఇసుక తరలింపునకు అడ్డేదీ?





ఎలిగేండ్ల వాగు నుంచి తీసుకెళ్తున్న ఇసుక.. కొండ్రోన్‌పల్లి వద్ద నిల్వ ఉంచిన ఇసుక

న్యూస్‌టుడే- ధన్వాడ

మరికల్, ధన్వాడ మండలాల్లో ఇసుక అక్రమంగా తరలింపునకు అడ్డే లేకుండా పోయింది. ఈ మండలాల్లో ప్రభుత్వం గుర్తించిన ఇసుక రీచ్‌లు లేవు. కోయిల్‌సాగర్ పెద్ద వాగు పరిధిలో పూసల్‌పాడు, రాకొండ గ్రామాలు ఉన్నాయి. ఎలిగేండ్ల, జిన్నారం గ్రామ శివారు గుండా మన్నె వాగు వెళ్తోంది. కొన్ని రోజులుగా పూసల్‌పాడు, రాకొండ శివారులోని వాగుల నుంచి పట్టపగలే ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మొదట్లో ఆయా గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యజమానులు రాత్రి వేళ ఇసుక తోడి ఒడ్డున కుప్పగా పోసి తరలించేవారు. ఇప్పుడు పట్టపగలే వాగుల నుంచి పట్టణాల దిశగా ఇసుక ట్రాక్టర్లు పరుగులు పెడుతున్నాయి ప్రస్తుతం ఈ ప్రాంతంలో పెద్దగా నిర్మాణ పనులు జరగడం లేదు. కొందరు అభివృద్ధి పనుల పేరుతో అనుమతులు లేకుండా తరలిస్తుంటే మిగతా వారు పెట్రేగిపోతున్నారు. పూసల్‌పాడు వాగు నుంచి మక్తల్ ప్రాంతానికి చెందిన కొందరు ఇసుకను తరలిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గోటూర్, కొండ్రోన్‌పల్లి శివార్లలో కోయిలసాగర్ పెద్ద వాగు ఉంది. కంసాన్‌పల్లి శివారులో మన్నెవాగు, పాతపల్లి శివారులో పెద్దవాగు, కొండాపూర్‌లో పీతురు వాగులు ఉన్నాయి. ఆయా వాగుల నుంచి ఇసుకను అనుమతులు లేకుండానే తరలిస్తున్నారు. రహదారులు దెబ్బతింటున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అంతే కాకుండా సమీపంలోని సోర్సుబోర్ల నీటి మట్టం తగ్గిందని, రాబోవు రోజుల్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పూసల్‌పాడు, రాకొండ గ్రామాల మధ్యనే కాకుండా సమీపంలోని కొండ్రోన్ పల్లి, గోటూర్ గ్రామాల రోడ్లు అడుగుకో గుంతలా తయారయ్యాయి.

విలువలు పెంచేవి గ్రంథాలయాలు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్

వనపర్తి న్యూటౌన్, న్యూస్‌టుడే : సాంకేతికత పెరిగిన నేపథ్యంలో సమాజంలో విలువలు, సంస్కృతిని, ధైర్యాన్ని పెంచేవి గ్రంథాలయాలేనని ప్రొహిబిషన్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో వనపర్తి గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గోవర్ధన్‌సాగర్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఎమ్మెల్యే మేఘారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. నాణ్యత, విలువలతో కూడిన విద్య లేక విద్యార్థులు చిన్నచిన్న విషయాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. జిల్లాలోని ప్రతి మండలంలో గ్రంథాలయాలను పండగ వాతావరణంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అందుకు కావాల్సిన నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ నల్లచెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బోటు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా వెంటనే మంజూరు చేశారన్నారు. అనంతరం సంస్థ ఛైర్మన్‌గా గోవర్ధన్‌సాగర్‌ను గ్రంథాలయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం మంత్రి, వనపర్తి ఎమ్మెల్యేతో పాటు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, పలువురునాయకులు, కార్యకర్తలు గోవర్ధన్‌సాగర్‌ను సన్మానించారు.

భారాస పాలనలో రాష్ట్రం అప్పులపాలు

భారాస నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం ఆయన వనపర్తి, దేవరకద్ర ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డితో కలిసి వనపర్తిలో విలేకరులతో మాట్లాడారు. భారాస ప్రభుత్వం చేసిన అప్పులకు తమ ప్రభుత్వం రూ. లక్షల కోట్ల వడ్డీ చెల్లిస్తూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేస్తున్నామన్నారు. దీపావళి నాటికి రూ. 2 లక్షలు రుణమాఫీ పూర్తి చేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఆక్రమణలు భారాస పుణ్యమేనని విమర్శించారు. వనపర్తి జిల్లాలో ప్రభుత్వ స్థలాలను ఆపార్టీ మహానుభావులు కబ్జా చేశారన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ వనపర్తి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి విషయంలో రాజీవ్‌చౌక్‌లో చర్చకు సిద్ధమా అని భారాస నాయకులకు సవాల్ విసిరారు.

గుండుమాల్ వ్యవసాయాధికారిగా రేష్మారెడ్డి



రేష్మారెడ్డిని సన్మానిస్తున్న వ్యవసాయ అధికారులు

కోస్గి, న్యూస్‌టుడే: గుండుమాల్ మండల వ్యవసాయ అధికారిగా రేష్మా రెడ్డి నియమితులయ్యారు. ఇటీవల ఉద్యోగం సాధించిన కోస్గి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన రేష్మా రెడ్డి ఈ ప్రాంతానికే అధికారిగా రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కోస్గి ఏవో రామకృష్ణ శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ఏవోగా రమేశ్



మద్దూరు, న్యూస్‌టుడే: కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారిగా కె. రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. ఏఈవోగా పని చేసిన ఆయన ఇటీవల నియామకాల్లో ఎంపికయ్యారు.

దేవుని చెరువు కాలువ సర్వే



వివరాలు సేకరిస్తున్న నీటిపారుదలశాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ ఆనంద్ కిశోర్

కోస్గి గ్రామీణం, న్యూస్‌టుడే : కోస్గి పట్టణ శివారులోని దేవుని చెరువు కాలువను సర్వే చేశామని నీటిపారుదల శాఖ డీఈ ఆనంద్ కిశోర్ తెలిపారు. గొల్లబావి, హన్‌మాన్ మందిరం పరిసరాల్లో పలువురు కాలువను ఆక్రమించారని అన్నారు. కాలువ దారిని మూసివేశారన్నారు. ఆక్రమించిన వారికి నోటీసులు అందజేస్తామని అన్నారు. పుర కమిషనర్‌కు నివేదిక అందజేస్తామన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : దామరగిద్ద జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థిని అంకిత అనారోగ్యంతో మృతి చెందింది. గత వారం రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

నిషేధిత గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మద్దూరు, న్యూస్‌టుడే: మద్దూరు పట్టణంలో రూ. 58,725 విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. ఎస్ఐ రాంలాల్ కథనం ప్రకారం కిరాణా దుకాణంలో గుట్కా, జర్దా నిల్వ ఉంచినట్లు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారన్నారు. సరకును స్వాధీనం చేసుకుని దుకాణదారుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుంతలతో అవస్థలే!




కోస్గి పట్టణం నుంచి చెన్నారం, బిజ్జారం మీదుగా మీర్జాపూర్‌కు వెళ్లే బీటీ రహదారి అడుగడుగునా గుంతలమయంగా మారింది. మోకాళ్లలోతు గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం ఏదో పనిపై కోస్గి పట్టణానికి రావాలంటే ఇబ్బందికరంగా ఉందని, పలువురు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గుంతలు పూడ్చాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోస్గి న్యూటౌన్

అయిదు తరగతులు.. ఇద్దరు ఉపాధ్యాయులు

కొండ్రోన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. అయిదు తరగతులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇద్దరు తలో తరగతి బోధిస్తుంటే మిగతా మూడు తరగతుల విద్యార్థులు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. కొత్త ఉపాధ్యాయులు వచ్చినందున డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుడ్ని తిప్పి పంపాల్సిందిగా గ్రామస్థులు విద్యాశాఖాధికారులను కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, ధన్వాడ



రహదారి బురదమయం



రాంకిష్టాయపల్లి ప్రధాన రహదారి చినుకు పడితే చాలు బురదమయంగా తయారవుతోంది. ఈ దారి మీదుగా వృద్ధులు, పిల్లలు నడవలేకపోతున్నారు. గుంతలు పడి నీళ్లు నిలుస్తుండటం, రహదారి పక్కన మురుగు కాల్వ అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్డు దెబ్బతింది. గుంతలు పూడ్చి రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డితో మాట్లాడగా మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ధన్వాడ

నిరుపయోగంగా కొండదొడ్డి ఎత్తిపోతల

కొండదొడ్డి సమీపంలో 25 ఏళ్ల కిందట నిర్మించిన ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నోచుకోక నిరుపయోగంగా ఉంది. వందలాది ఎకరాలు బీడుగా మారాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పరిసర గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని పునరుద్ధరించాలని కోరారు.
- న్యూస్‌టుడే, మక్తల్ గ్రామీణం

